
ప్రజాశక్తి
గురువారం 7 డిసెంబర్ 2023 5
శ్రీ సత్యసాయి



పారదర్శకంగా ఓటరు జాబితా : ఆర్డీవో

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఓటరు జాబితా తయారీలో బూత్ స్థాయి అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని ఆర్డీవో భాగ్యరేఖ సూచించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నాయకులతో స్థానిక ఆర్డీవో కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పుట్టపర్తి తహశీల్దార్ కరణం నవీన్ కుమార్, మునిసిపల్ కమిషనర్ రాంభూపాల్, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ కందే నరసింహులు, రహిమాన్, ఆపరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నాయకులు తమ పార్టీ నుండి బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాలని కోరారు. తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయాలని తహశీల్దార్లకు సూచించారు, ఈ సమావేశంలో వైసిపి రంగారెడ్డి, టీడీపీ బేకరీ వెంకట నాయుడు,సామకోటి ఆది నారాయణ, బిజెపి విజయ భాస్కర్ రెడ్డి, సిపిఐ ఆంజనేయులు, బిఎస్‌పి రాయుడు తదితరులు పాల్గొన్నారు.



అన్నదాతకు పంటనష్ట

పరిహా(ర/స)ం

మూడొంతుల మందికి పరిహారం లేనట్టే.?

◆ ఈకేవైసి చేయించుకున్న వారు 2.63 లక్షల మంది... పరిహారం అందనున్నది 1.69 లక్షల మందికి

◆ సాగు 6.49 లక్షల ఎకరాలు... పరిహారం 4.42 లక్షల ఎకరాలకు..!

◆ కరువు ప్రతిపాదనలు సిద్ధం చేసిన యంత్రాంగం

◆ రూ.251.20 కోట్ల నష్టపరిహారం అంచనాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

2023 ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావం నెలకొంది. సీజన్ ప్రారంభం నుంచి ఈ ఏడాది వర్షాలు సరిగా పడలేదు. ఈ నేపథ్యంలో అనంతపురం జిల్లాలో 28 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారు. దీనికి సంబంధించి నష్ట పరిహారం అంచనాలను రూపొందించాలని నవంబర్ మాసంలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో కొన్ని షరతులు కూడా పెట్టింది. ఐదు ఎకరాల వరకే పరిహారాన్ని అంచనా వేయాలని, అందులోనూ 33 శాతానికంటే ఎక్కువ నష్టం ఉన్న పంటలనే పరిగణలోకి తీసుకోవాలని ఇలా అనేక షరతులు పెట్టింది. పరిహారం మొత్తాన్ని కూడా చాలా తక్కువగా ప్రకటించిందని విపక్షాలు తప్పుబట్టాయి. అయినా ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారమే అధికారులు అంచనాలను పూర్తి చేశారు. దీని ప్రకారం చూస్తే మూడొంతుల మందికి పరిహారం అందే పరిస్థితి కనిపించడం లేదు.



సాగైంది 6.49 లక్షల ఎకరాలు..
పరిహారం 4.42 లక్షల ఎకరాలకు...

2023 సీజన్ ప్రారంభం నుంచి వర్షాభావమే నెలకొనడంతో సాధారణ సాగులో 69 శాతమే సాగైంది. అంటే ఖరీఫ్‌లో 6.49 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇవి కాకుండా 3.05 లక్షల ఎకరాలు ఉద్యానవన పంటలు సాగయ్యాయి. పంటనష్టపరిహారం అంచనాల్లో ఉద్యానవన పంటలు మినహాయించి సాధారణ పంటలకే పరిహారం లెక్కించారు. దీని ప్రకారం చూస్తే 4.42 లక్షల ఎకరాలకు పరిహారం అందుతుందని అధికారులు అంచనా వేశారు. సాగైన దానిలో 68 శాతం పంట విస్తీర్ణానికి పరిహారం రానుంది. ఇక రైతుల వారీగా చూస్తే ఈ-కెవైసి చేయించుకున్న రైతుల సంఖ్య 2.63 లక్షల ఎకరాలుంది. ఇందులో 1.79 లక్షల మంది రైతులకు పరిహారం అందనుంది. అంటే 64 వాతం మంది రైతులకు మాత్రమే పరిహారం అందనుంది. తక్కిన రైతులకు పరిహారం అందే అవకాశాలు కనిపించడం లేదు. దీనికి సంబంధించి రూ.251,20 కోట్లు నష్ట పరిహారానికి ప్రతిపాదనలు పంపించారు.

రైతులందరికీ నష్ట పరిహారమివ్వాలి

ఖరీఫ్‌లో వర్షాభావంతో రైతులందరూ పంటలను నష్టపోయారు. లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి నష్టపోయి ఉన్నారు. వారందరికీ పరిహారం అందివ్వాలి. అదికూడా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పరిహారం ఇవ్వాలని తాము ముందు నుంచే కోరుతున్నాం. ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం రైతుకు అందే సహాయం నామమాత్రమే. వేరుశనగ సాగుకు ఎకానికి రూ.40 వేల వరకు ఖర్చు వస్తోంది. కాని ప్రభుత్వమిస్తున్న సహాయం రూ.7000 కూడా ఎకరానికి ఉండటం లేదు. అందుకే రైతులను పూర్తి స్థాయిలో ఆదుకోవాలని రైతు సంఘంగా డిమాండ్ చేస్తున్నాం. అది కూడా రైతులందరికీ పరిహారమివ్వాలి.

చంద్రశేఖర్‌రెడ్డి
ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి



ఎంజిఎం పాఠశాల ఆవరణంలో చెడిపోయిన గుడ్లను పడేసిన విద్యార్థులు

మధ్యాహ్న భోజనంలో కుళ్లిన కోడిగుడ్లు

విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన

ప్రజాశక్తి-హిందూపురం

మధ్యాహ్న భోజనంలో పిల్లలకు ఇస్తున్న కోడిగుడ్లు కొన్ని కుళ్లిపోతున్నాయి. దీనిపై మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు, ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల పాఠశాలలకు ఇస్తున్న గుడ్లలో 40 శాతం కుళ్లిపోయినవే ఇస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా బుధవారం నాడు హిందూపురం పట్టణంలోని ఎంజిఎం పాఠశాలలో విద్యార్థులకు సరఫరా చేసిన గుడ్లు చాలా వరకు కుళ్లిపోయాయి. దీంతో విద్యార్థులు వాటిని తినకుండా పాఠశాల ఆవరణంలోనే పడేశారు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుడ్లు ఉడికిస్తున్న సమయంలో దుర్వాసన వస్తున్నాయని ఏజెన్సీ సభ్యులు చెబుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి నాణ్యమైన గుడ్లు అందించేలా చర్యలు తీసుకోవాలని తల్లితండ్రులు కోరుతున్నారు. ఈ విషయంపై ప్రధానోపాధ్యాయురాలు సామ్రాజ్యం మాట్లాడుతూ పాడైపోయిన గుడ్ల విషయాన్ని తమ దష్టికి తీసుకురాగానే వాటికి బదులుగా కొత్త గుడ్లు ఇస్తున్నామన్నారు. ఈ విషయంపై ఎంఇఒ గంగప్పను వివరణ కోరగా పాఠశాలలకు సంబంధించి నాణ్యమైన కోడిగుడ్లు సరఫరా చేయకుంటే ఏజెన్సీల నిర్వాహకులపై ఉన్నతాధికారులు అనుమతితో చర్యలు తీసుకుంటామన్నారు.

పేదల పోరాటానికి స్పందన

◆ ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు అధికారుల చర్యలు ◆ అర్హులందరికీ న్యాయం చేయాలి : సిపిఎం



అధికారుల గుర్తించిన స్థలాన్ని పరిశీలిస్తున్న సిపిఎం, వ్యకాసం నాయకులు

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

ఇళ్ల పట్టాల కోసం సిపిఎం, వ్యకాసం ఆధ్వర్యంలో గోరంట్ల మండలం పాలసముద్రం గ్రామానికి చెందిన పేదలు చేసిన నిరసన పోరాటానికి అధికారుల నుంచి స్పందన లభించింది. ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు అధికారులు ముందుకు వచ్చారు. పాలసముద్రం గ్రామానికి చెందిన ఇళ్లు లేని నిరుపేదలు, పట్టాదారులు, స్వాధీన అనుభవదారులు సోమవారం నాడు మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా తహశీల్దార్ స్పందించి రెండు రోజుల్లో గ్రామాన్ని సందర్శిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు బుధవారం ఉదయం పాలసముద్రం సర్వేనెంబర్ 125లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని ఆర్ఐ సమక్షంలో గ్రామ సర్వేయర్, విఆర్ఒ చేత సరిహద్దు కొలతలు వేసి గుర్తించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పెద్దన్న మాట్లాడుతూ పేదలందికీ ఇళ్ల పట్టాలు కేటాయించాలన్నారు. ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా అర్హులకు న్యాయం చేయాలని కోరారు. నామమాత్రపు సర్వే చేసి వదిలేస్తే పేదలతో కలిసి మరోసారి పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. తహశీల్దార్ స్పందిస్తూ మండల సర్వేయర్ వస్తారని తప్పకుండా పూర్తిస్థాయి సర్వే చేపట్టి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, సిపిఎం నాయకులు కొండా వెంకటేశులు, స్థానికులు వెంకట లక్ష్మమ్మ, రామలక్ష్మమ్మ, సుకన్య పాల్గొన్నారు.

అధికారులపై డిపిఒ ఆగ్రహం

ప్రజాశక్తి - కొత్తచెరువు

పారిశుధ్య చర్యలు తీసుకోవటంలో అధికారులు వహిస్తున్న నిర్లక్ష్యంపై డిపిఒ విజయ్‌కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సమీపాన ప్రధాన రహదారిపై పెద్ద గుంత ఏర్పడి అక్కడ మురుగునీరు నిల్వ ఏర్పడి అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన జిల్లా పంచాయతీ అధికారి విజయ్ కుమార్ రెడ్డి, పుట్టపర్తి డి ఎల్ పిఒ శివకుమారి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితి ఇంత అధ్వానంగా ఉన్నా స్థానిక అధికారులు తమకు ఏమీ పట్టనట్టుగా ఎందుకు వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. గ్రామంలో ఏ వీధిలో చూసినా అపరిశుభ్రంగా ఉన్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి సమీపాన పెద్ద గుంత ఏర్పడి నీరు నిల్వ ఉన్నా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. మూడు సంవత్సరాలుగా సమస్య ఉన్నా ఎందుకు స్పందించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మండలకేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే మిగతా చోట ఎలా ఉంటుందో అర్థం అవుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ సిద్ధారెడ్డి, మేజర్ పంచాయతీ కార్యదర్శి గోపాల్ పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - మడకశిర

సత్యసాయి జిల్లాలో ఉన్న 32 మండలాలను కరువు మండలాలుగా గుర్తించి కరువు సహాయక చర్యలు చేపట్టాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని బుధవారం స్థానిక తహశీల్దార్ ముషార్ వలికి సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 32 మండలాల్లో కూడా కరువు ఉన్నా కేవలం 21 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడం భావ్యం కాదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పంటలు వేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 40వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీడు భూములుగా వదులుకున్న వారికి ఎకరాకు 25 వేల రూపాయలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వెంకట రంగారెడ్డి, సోంకుమార్, నరసే గౌడ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో గ్రామపంచాయతీలు నిర్వీర్యం

మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి కదిరి అర్బన్

వైసిపి పాలనలో గ్రామపంచాయతీలు నిర్వీర్యం అయ్యాయని మాజీ ఎమ్మెల్యే, టిడిపి కదిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ విమర్శించారు. గ్రామాల అభివృద్ధికై సర్పంచుల సమర శంఖారావం పేరిట పట్టణంలోని తాయి గ్రాండ్‌లో నిర్వహించిన సమావేశానికి కందికుంట ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేసిన జగన్మోహన్‌రెడ్డి చరిత్ర హీనుడుగా నిలిచారని విమర్శించారు. సర్పంచుల విధులను నిర్వీర్యం చేసి చీకటి మార్గంలోకి నెట్టిన జగన్‌కు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. గాండ్లపెంట మండలం కురుమామిడి పంచాయతీకి చెందిన వైసీపీ సానుభూతి పరుడైన సర్పంచి సుధాకర్ రెడ్డి వైసిపి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి సర్పంచులకు అన్యాయం చేసిందన్నారు. సైకో జగన్మోహన్ రెడ్డి వల్ల సర్పంచులు ఆత్మహత్య చేసుకుంటున్నారని పలువురు విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి పతనం తప్పదని సర్పంచులు జోస్యం చెప్పారు. ఈ సమావేశంలో సర్పంచుల సంఘం నాయకులు, సర్పంచులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కందికుంట

తప్పుల్లేని ఓటరుజాబితా తయారు చేద్దాం

◆ క్షేత్రస్థాయిలో బిఎల్‌ఒల పాత్ర అత్యంత ప్రాధాన్యం ◆ కలెక్టర్ పి.అరుణ్ బాబు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఓటర్ల నమోదును అత్యంత పారదర్శకంగా చేపట్టి తప్పుల్లేని ఓటరుజాబితా తయారు చేసేలా అధికారులందరూ పని చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. ధర్మవరం ఆర్డీవో కార్యాలయం సమావేశ మందిరంలో ధర్మవరం డివిజన్ పరిధిలోని సహ ఎన్నికల అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు, బిఎల్వోలతో ఓటరు నమోదు పెండింగ్ క్లెయిమ్‌ల పరిష్కారంపై సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ కొండయ్య, ధర్మవరం ఆర్డీవో రమేష్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బండిశేషయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల నమోదులో మార్పులు, తీసివేతల ప్రక్రియ అత్యంత ప్రాధాన్యమైనదన్నారు. వీటిపై సంబంధిత సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలన చేసి వివరాలు సేకరించాలని చెప్పారు. బల్క్ గా అందిన దరఖాస్తులపై ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి తగు పరిష్కారం చేయాలన్నారు. అర్హులైన ఒక్క ఓటరుని కూడా జాబితా నుంచి తొలగించరాదని స్పష్టం చేశారు. చేర్పులు, తొలగింపులు, మతులకు సంబంధించి బిఎల్వోలు రిజిస్టర్లను తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. ఒకే ఇంటిలో 10 ఓట్లుపైగా ఉన్న వాటి మీద ప్రత్యేక దష్టి సారించాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బిఎల్వోలు పోలింగ్ స్టేషన్‌లో తప్పనిసరిగా ఉండాలన్నారు. బిఎల్‌ఒలు తప్పనిసరిగా క్లైమ్ ఫారంలను తీసుకువెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు, ఎన్నికల డిప్యూటీ తాహశీల్దార్లు పాల్గొన్నారు.



ఓటర్ల జాబితాపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

భయాందోళనలో వీరాపురం ప్రజలు



తహశీల్దార్ కార్యాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన



గ్రామంలో పర్యటిస్తున్న అధికారులు

ప్రజాశక్తి:- చిలమత్తూరు

మండల పరిధిలో వీరాపురం గ్రామపంచాయతీ దాదిరెడ్డిపల్లి, తండావాసులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామంలో ఈగల సమస్య తారాస్థాయికి చేరింది. గ్రామంలో పలువురు వాంతులు విరోచనాలతో అనారోగ్యం పాలవడంతో గ్రామస్తులు బెంబేలు ఎత్తుతున్నారు. గ్రామానికి సమీపంలో ఉన్న కోళ్ల ఫారం వల్ల ఈగలు ప్రబలి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ పాఠశాల కూడా మూసివేశారని ప్రజాశక్తి లో అనేక కథనాలు ప్రచురితమయ్యాయి. ప్రస్తుతం సమస్య తీవ్రత పెరిగింది. ప్రజలు అనారోగ్యం బారిన పడటంతో గ్రామస్తులు సిపిఎం నాయకులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో సిపిఎం ఆధ్వర్యంలో గ్రామస్తులు బుధవారం ఆందోళనకు దిగారు. స్తాఇనక ఎంపిడిఒ కార్యాయం ముందు ధర్నా చేశారు. తమ ఇళ్ల ముందు కుప్పలు కుప్పలుగా ఉన్న ఈగలను సంచుల్లో తెచ్చి ఎంపిడిఒ కార్యాలయం ముందు వేసి ఆందోళన చేపట్టారు. తాము ఎన్ని సార్లు అధికారులకు విన్నవించుకున్నా తాత్కాలిక కంటి తుడిపు చర్యలు చేపట్టి చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ 6 నెలలుగా దాదిరెడ్డిపల్లి, తండా, లక్ష్మీపురం వాసులు ఈగల సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. వారు కనీసం భోజనం తినలేని పరిస్థితి నెలకొందని అన్నారు. ప్రజలతో పాటు పశువులు అనారోగ్యం బారిన పడుతున్నా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కార్యకర్తల ఇళ్లలో నిద్రచేస్తున్న ప్రజాప్రతినిధులు ఒక్క రోజు ఈ మూడు గ్రామాల్లో నిద్ర చేస్తే సమస్య తీవ్రత అర్థం అవుతుందని అన్నారు. కనీసం అన్నం తినాలన్నా పరదాలు వేసుకొని తినే దీన స్థితిలో ప్రజలు ఉన్నారని అన్నారు.

అపరిశుభ్రతతో అనారోగ్యంపాలు స్పందించిన అధికారులు

గ్రామానికి ఆనుకొని కోళ్ల పరిశ్రమకు ఎలా పర్మిషన్ ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. గ్రామాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ నరేష్‌క్రిష్ణకు వినతిపత్రం అందజేశారు.

గ్రామాల్లో పర్యటించిన అధికారులు : గ్రామస్తుల ఆందోళనతో అధికారుల్లో చలనం ఏర్పడింది. ఈ మేరకు వారు బుధవారం దాదిరెడ్డిపల్లి, తండా, లక్ష్మీపురం గ్రామాల్లో పర్యటించారు. ఆగ్రామాల్లో ఈగల స్వైర విహారాన్ని చూసి అధికారులు ఖంగు తిన్నారు. వెంటనే గ్రామసభ ఏర్పాటు చేసి తీర్మాణం చేసి కోళ్ల ఫారం మూసివేతకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రాథమిక చర్యగా కోళ్ల పరిశ్రమ యజమానికి నోటీసులు అందజేశారు. శానిటేషన్ చేసి ఈగలను తక్షణం నివారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నరేష్‌క్రిష్ణ, ఇఒఆర్‌డి ఈశ్వరయ్య, వీరాపురం సర్పంచి లక్ష్మిపతిరెడ్డి, సిపిఎం ప్రవీణ్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన మెడికల్ క్యాంపు : ఈగల ప్రభావం తో గ్రామస్తులు అనారోగ్యం బారిన పడటంతో వైద్యశాఖ అధికారులు స్పందించారు. బుధవారం యుద్ధప్రాతిపదికన మెడికల్ క్యాంపు నిర్వహించి అనారోగ్యం బారిన పడిన వారికి వైద్యసేలు అందించారు. గ్రామాల్లోని పరిస్థితిని డిఎంహెచ్ఒ దృష్టికి తీసుకెళతామని వైద్యులు నికేష్ చెప్పారు.

తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఒపై దాడి

చేతిలోని డాక్యుమెంట్లు లాక్కెళ్లిన రియల్టర్

ప్రజాశక్తి - చెన్నేకొత్తపల్లి

సాక్ష్యాత్తు తహశీల్దార్ కార్యాలయంలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి విఆర్‌ఒపై దాడికి పాల్పడ్డాడు. 'నేను చెబితే చెయ్యవా.. ? నీవు ఎలా విధులు నిర్వహిస్తావో చూస్తా ' అంటూ దౌర్జన్యం చేస్తూ కులం పేరుతో దూషించిన ఘటన చెన్నేకొత్తపల్లి తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం చోటు చేసుకుంది. ఈఘటనకు సంబందించి బాధిత విఆర్‌ఒ లోకేష్ తెలిపిన వివరాలు... చెన్నేకొత్తపల్లి 2 గ్రామ రెవెన్యూ అధికారిగా లోకేష్ విధులు నిర్వర్తిస్తున్నాడు. చెన్నేకొత్తపల్లి గ్రామ పొలానికి సంబంధించిన సర్వే నంబర్ 189 లోగల 5 ఎకరాలకు సంబంధించి ధర్మవరం కోర్టులో ఒఎస్ నంబర్ 520 /2023 ఉంది.ఈ భూమికి సంబంధించి సంబంధం లేని వ్యక్తి మ్యూటేషన్ చేయాలని దరఖాస్తు చేసుకున్నాడు. ఈ మ్యూటేషన్ దరఖాస్తును తిరస్కరించాలని తహశీల్దార్ సంబందిత విఆర్‌ఒ లోకేష్‌ను ఆదేశించారు. ఈ విషయంపై మండలంలోని చిన్నపల్లికి చెందిన సింగం కృష్ణారెడ్డి కుమారుడు సింగం సోమశేఖర్ రెడ్డి బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి వచ్చాడు. తహశీల్దార్ చాంబర్‌లో ఉన్న లోకేష్ వద్దకు వచ్చి చెన్నేకొత్తపల్లి గ్రామ పొలానికి సంబంధించిన సర్వే నంబర్ 189 లోగల 5 ఎకరాలకు సంబంధించిన మ్యూటేషన్‌ను ఆమోదించాలని కోరాడు. దీంతో విఆర్‌ఒ ఈ సర్వే నంబర్ కోర్టులో ఉందని ఆ మ్యూటేషన్ దరఖాస్తును తిరస్కరించాలని తహశీల్దార్ ఆదేశించినట్లు సమాధానమిచ్చాడు. దీంతో సోమశేఖర్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. 'నేను చెబితే చెయ్యవా ? నీకు ఎన్ని గుండెకాయలు ఉన్నాయిరా' అంటూ విఆర్‌ఒ చొక్కా పట్టుకొని కులం పేరుతో దూషిస్తూ భౌతిక దాడికి పాల్పడ్డాడు. 'కోటి రూపాయలు ఖర్చు అయినా పరవాలేదు నీ అంతు చూస్తా.. నీవు ఎలా విధులు నిర్వహిస్తావో చూస్తా' అని బెదిరించి విఆర్‌ఒ చేతిలో ఉన్న డాక్యుమెంట్‌ను లాక్కొని వెళ్లాడు. తనపై జరిగిన దాడిపై ఎస్ఐ శ్రీధర్‌కు ఫిర్యాదు చేసినట్లు విఆర్‌ఒ లోకేష్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగి, దళితుడైన తనపై దాడిని పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరాడు.

దాడి అమానుషం : విఆర్‌ఒ లోకేష్‌పై జరిగిన దాడిని మండలంలోని పలువురు ఖండించారు.ఉత్సవ సొసైటీ సభ్యులు, సెక్రెటరీ సివి ప్రసాద్, 2 వ ఉపాధ్యక్షులు దామాజిపల్లి గంగాధర, ట్రెజరర్ రాచెర్ల రామకృష్ణ, ఇసి సభ్యులు రామాంజినేయులు, సిపిఐ మండల నాయకులు తదితరులు విఆర్‌ఒపై జరిగిన దాడిని ఖండించారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన వారు ఉద్యోగాలు చేయకుడదా అని ఈ సందర్భంగా వారు ప్రశ్నించారు. ఈ దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

హోంగార్డులకు ప్రశంసా పత్రాలు

రొద్దం : జిల్లా పోలీస్ గ్రౌండ్‌లో నిర్వహించిన పెరేడ్‌లో నిర్వహించిన రైజింగ్‌లో ప్రతిభ కనపర్చిన రొద్దం పోలీసుస్టేషన్‌కు చెందిన ఇద్దరు హోంగార్డులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్పీ చేతుల మీదుగా వీరు ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

దోమల పట్ల జాగ్రత్తగా ఉండండి

మడకశిర: ప్రజలు దోమల పట్ల జాగ్రత్తగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి షమీవుల్లా, హెల్త్ సూపర్వైజర్ రాంప్రసాద్ సూచించారు. ఈ మేరకు వారు బుధవారం తురకవాండ్లపల్లిలో దోమల నివారణ చర్యలు చేపట్టారు. అనంతరం గ్రామంలోని అంగనవాడీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ దోమల నివారణ, దోమల నుంచి వచ్చే వ్యాధులు తదితర విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ చెన్నకేశవరెడ్డి, ఎఎన్ఎం ఉషా లత, ఆశా వర్కర్లు అంజనమ్మ, నాగమణి, అంగనవాడీ కార్యకర్తలు మాళమ్మ, పార్వతమ్మ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బస్సుయాత్ర ఏర్పాట్ల పరిశీలన

మడకశిర : పట్టణంలో గురువారం వైసిపి ఆధ్వర్యంలో చేపడుతున్న బస్సు యాత్రకు సంబందించిన ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పరిశీలించారు. అమరాపురం బస్టాండ్‌లోని వైఎస్ఆర్ సర్కిల్లో కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ముందుగా హిందూపూర్ రోడ్డు లోని సరస్వతీ విద్యా మందిరంలో మేధావుల సదస్సు కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, గుమ్మనూరు జయరాం, ఉషా శ్రీచరణ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ముఖ్య నాయకులు హాజరవుతున్నారని చెప్పారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పుట్టకామప్ప, మున్సిపల్ చైర్మన్ తనయుడు జయరాజు, కౌన్సిలర్ సుభద్ర నాగేంద్ర, వక్కలిగ సంఘం డైరెక్టర్లు నాగరాజ్ గౌడ్, వేణు ప్రకాష్, సిఐ సురేష్ బాబు, ఎస్ఐ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దుచేయాలి

ధర్మవరం టౌన్ : భూ యాజమాన్య హక్కుచట్టాన్ని వెంటనే రద్దుచేయాలని ధర్మవరం బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు బుధవారం ధర్మవరంలో ర్యాలీ నిర్వహించారు. కోర్టు నుండి న్యాయవాదులు ప్రారంభించిన ర్యాలీ కళాజ్యోతి, ఎన్టీఆర్, గాంధీసర్కిల్ మీదుగా తిరిగి కోర్టు వరకు కొనసాగింది. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ.. ప్రజావ్యతిరేకమైన ఈ చట్టాన్ని రదుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురు చేరిక

కదిరి అర్బన్ : గాండ్లపెంట మండలం వేపరాల పంచాయతీకి చెందిన పలువురు వైసిపి సానుభూతి పరులు టిడిపిలో చేరారు. గ్రామపంచాయతీల విధులను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేసి విధానాన్ని ఎండగట్టడానికి బుధవారం స్థానిక తాయి గ్రాండ్ లో జరిగిన సర్పంచుల సమావేశంలో కందికుంట సమక్షంలో పలువురు టిడిపిలో చేరారు. వైసిపి సానుభూతిపరులు బుసిరెడ్డి వెంకటరెడ్డి, అశోక్, తరుణ్, కృష్ణశేఖర్, రమేష్‌లకు పార్టీ కండువాలు కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, గాండ్లపెంట కన్వీనర్ కొండయ్య, క్లస్టర్ ఇన్‌ఛార్జి ప్రసాద్, తెలుగు యువత సభావత్ అంజి నాయక్, రవి కుమార్ రెడ్డి,కదిరి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

పుట్టపర్తి రూరల్ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అదే విధంగా మాతా శిశు సంరక్షణ పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సూచించారు. మండల పరిధిలోని బత్తలపల్లి గ్రామంలో బుధవారం వైద్య సిబ్బంది పర్యటించి అనీమియా, పౌష్టికాహారం పరిసరాల పరిశుభ్రత తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమములో సామాజిక ఆరోగ్య కార్యకర్త నగేష్, సూపర్ వైజర్లు చంద్రకళ, ఎంఎల్‌హెచ్‌పి సత్యమ్మ, ఆరోగ్య కార్యకర్త జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు విడుదల

పుట్టపర్తి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడలను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రకు సంబందించిన పోస్టర్లను బుధవారం విడుదల చేశారు. పుట్టపర్తి మండల పరిధిలోని పెడపల్లి గ్రామం సచివాలయంలో బుధవారం ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి , ఎంపీపీ రమణారెడ్డి, కార్యదర్శి శశికళ మహిళా పోలీసుల ఆధ్వర్యంలో వీటిని విడుదల చేశారు.

సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది

మధ్యాహ్నం 3 గంటలకే ఇళ్లకు వెళ్లిన అధికారులు



ఖాళీ కుర్చీలతో సచివాలయం

ప్రజాశక్తి గుడిబండ

మండలంలోని కిరికెర గ్రామ సచివాలయ ఉద్యోగులు విధినిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఏమాత్రం సమయ పాలన పాటించలేదు. మధ్యాహ్నం మూడు గంటలకే విధులకు డుమ్మాకొట్టి ఇళ్లకు వెళ్లిపోయారు. ఈ సచివాలయంలో దాదాపు 8 మంది అధికారులు విధులు నిర్వర్తిస్తుండగా ఉండగా మధ్యాహ్నం 3 గంటలకు అందరూ విధులకు డుమ్మా కొట్టి ఇళ్లకు వెళ్లిపోయారు. దీంతో సచివాలయం ఖాళీ కుర్చీలతో దర్శనం ఇచ్చింది. కార్యాలయంలో ఏ ఒక్క అధికారి కూడా లేడు. సచివాలయంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంప్యూటర్, ఇతర పరికరాలు, సామాగ్రి కానీ ఎవరైనా దోచుకెళితే పట్టించుకునే వారు లేరు. దీన్ని బట్టి చూస్తే విధుల నిర్వహణలో సిబ్బంది చిత్తశుద్ది ఏమేరకు ఉందో అర్థం అవుతోంది. సచివాలయ పరిధిలో ఉన్న వివిధ శాఖకు సంబంధించిన సిబ్బంది ఉదయం 9 గంటలకు విధులకు హాజరై సాయంత్రం ఐదు గంటల వరకు కార్యాలయంలో ఉండాలి. అయితే బుధవారం మాత్రం మధ్యాహ్నం3 గంటలకే మొత్తం సచివాల సిబ్బంది విధులకు డుమ్మా కొట్టి ఇంటికి వెళ్లారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో సచివాలయ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అంగవైకల్యం శాపం కారాదు

ప్రజాశక్తి - మడకశిర

విభిన్న ప్రతిభావంతులకు అంగవైకల్యం ఏమాత్రం శాపం కారాదని విశ్రాంతి డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని సాయిబాబా దేవాలయం ఆవరణంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్రాంత డీఎస్పీతో పాటు స్థానిక ఎస్ఐ లోకేష్, వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రేకులకుంట హనుమంత రాయప్ప, ఎటిఎల్ సౌమ్య, హనుమంత రెడ్డి, పుట్ట నరసమ్మ, ఆనంద్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల పిల్లల పట్ల ప్రేమతో వ్యవహరించడంతోపాటు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీరిలో కచ్చితంగా ఏదో ఒక విభిన్నమైన ప్రతిభ ఉంటుందని దానిని గుర్తించి వెలికి తీయాలని సూచించారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న వికలాంగులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత డీఎస్పీ

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : డీఎస్పీ

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని డీఎస్పీ శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద బుధవారం ఆటో, క్యాబ్ డ్రైవర్లకు రోడ్డు నిబంధనలు, చట్టాలపై ట్రాఫిక్ సిఐ శ్యామరావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డీఎస్పీ శ్రీనివాసులు, వన్ టౌన్,టూ టౌన్ సిఐలు సుబ్రమణ్యం, అశోక్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... ప్రతి డ్రైవర్ తమ వాహనాలకు ఆర్సీతోపాటు డ్రైవింగ్ లైసెన్స్ తప్పని సరిగా కల్గిఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ పట్టణ అధ్యక్షులు తొండమాల బాబు, కార్యదర్శి ఆదిమూర్తి, ఉపాధ్యక్షులు రఫీ, నాయకులు అబ్బాస్, అంజి, శేఖర్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు

పారదర్శకంగా కులగణన



చిలమత్తూరులో జరిగిన సమావేశంలో పాల్గొన్న అధికారులు, నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న హిందూపురం మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి - కొత్తచెరువు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణనను పారదర్శకంగా నిర్వహించాలని మండల స్పెషల్ ఆఫీసర్ శివ రంగ ప్రసాద్, తహశీల్దార్ రామాంజనేయ రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అన్ని కుల సంఘాల నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బారాంసాహెబ్, ఏపీవో నాగిరెడ్డి, కుల సంఘాల నాయకులు ముద్దుల భాస్కర, అశోక్, రఫీ, మున్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణనను పక్కాగా చేపట్టాలని ఎంపీపీ బగ్గిరి త్రివేణి, ఎంపీడీవో సాయిమనోహర్ ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బగ్గిరి త్రివేణి అధ్యక్షతన కులగణన సర్వేపై రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, వివిధ కుల సంఘాల నాయకులు, గ్రామ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో డిసెంబర్ 9 నుంచి 19 వరకు కుల గణన సర్వే ప్రారంభమవుతుందని, వంద శాతం గృహాలను కవర్ చేయాలని ఆదేశించారు. కులగణన సర్వేలో సంబంధిత సంక్షేమ శాఖల అధికారులు భాగస్వాములు కావాలని చెప్పారు. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఓబుల దేవర చెరువు : కులగణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి రమేష్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ తుమ్మల పర్వీన్ షామీర్ అధ్యక్షతన కుల గణన సర్వే సంబంధించిన సమావేశాన్ని అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ పది రోజుల్లోగా కుల గణన సర్వేను క్షేత్రస్థాయిలో చేపట్టి అధికారులు పరిశీలించి నివేదికలను తయారు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇఒఆర్‌డి రాజశేఖర్, ఎంఇఒ సురేష్ బాబుతోపాటు ఆయా శాఖల అధికారులు ,రాజకీయ నాయకులు, కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : కులగణనపై ఎంపిడిఒ నరేష్ క్రిష్ణ అధ్యక్షతన స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో కులసంఘాలు, ప్రజాప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు, ఇఒఆర్‌డి ఈశ్వరయ్య, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

హిందూపురం : ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చేపడుతున్న కుల గణనను సచివాలయ సిబ్బంది వార్డు వాలంటీర్ల సహకారంతో పారదర్శకంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ అన్నారు. బుధవారం పురపాలక సంఘ వ్యాప్తంగా సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న వార్డు సెక్రెటరీలకు కుల గణనపై మున్సిపల్ కార్యాలయంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మేన్ బలరామిరెడ్డి, కౌన్సిల్ ప్రతి పక్ష నేత రమేష్ కుమార్, టౌన్ ప్లానింగ్ ఎసిపి, పలువురు కౌన్సిలర్లు హాజరయ్యారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు

ప్రజాశక్తి - ముదిగుబ్బ

ప్రతి ఒక్కరికి వారి ఇంటి వద్ద నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా కుటుంబ వైద్యుడు కార్యక్రమాన్ని చేపట్టిందని ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్య సమస్యలను ఈ కార్యక్రమం ద్వారా ఉచితంగా పరిష్కరించుకోవాలని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి శ్వేత కోరారు. మండల పరిధిలోని దొరికిల్లు గ్రామంలో బుధవారం కుటుంబ వైద్యుడు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ విజయ కుమారి, సిహెచ్ఒ భారతి, హెల్త్ అసిస్టెంట్ నాగరాజు, అంగన్వాడీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - రొద్దం

మండలంలని పెద్దమంతురు పంచాయతీ గ్రామ సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల లబ్దిని వివరించే డిజిటల్ బోర్డును ఎంపిపి చంద్రశేఖర్ ఆవిష్కరించారు. అనంతరం వెసిపి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ రవిశేఖర్ రెడ్డి, స్థానిక సర్పంచి అశ్వత్థమ్మ, రవి, ఎంపిటిసి వెంకటేసులు, డీలర్ రవి, ఎంపిడిఒ రాబర్ట్ విల్సన్, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండలంలోని కొండగట్టుపల్లి గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సివి నారాయణరెడ్డి , జెడ్పీటీసీ తిరుమల సేవ్ నాయక్, మల్ల గుండ్ల భాస్కర్, వైసిపి నాయకులు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి- హిందూపురం

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం అని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అందరు సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా ఎదగాలని గ్రామీణ అభివృద్ధి పంచాయతీరాజ్, గ్రామీణ అభివద్ధి శాఖల ప్రభుత్వ సలహాదారులు పోతుల నాగార్జున రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం హిందూపురం రూరల్ మండలంలోనిపలు ప్రాంతాలలో పర్యటించారు. తొలత మణేసముద్రంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులతో పాటు నాడు-నేడు పనులను, అంగన్ వాడి భవన నిర్మాణాల పనులు ఇతర అభివృద్ధి పనులను పరిశీలించారు.కిరికెర గ్రామ పంచాయితీ వివర్స్ కాలనీలో మహిళా సాధికారతపై స్వయం సహాయక సంఘాల సభ్యులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, ఎంపిడిఒ నరేంద్ర కుమార్, ఎంఇఒ గంగప్ప, ఇతర మండల స్థాయి అధికారులతో పాటు మండల ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పోతుల నాగార్జున రెడ్డి

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు



తహశీల్దార్ కు వినతి పత్రం అందజేస్తున్న అంగన్వాడీవర్కర్లు

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

అంగన్వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిసెంబర్ 8 నుంచి జరిగే నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్. వెంకటేష్ కోరారు. ఈసందర్భంగా ఆయనతో పాటు శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ దిల్షాద్ మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లకు కనీస వేతనాలు అమలు చేయకపోవటంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంగన్వాడీ సెంటర్ల నిర్వహణకు సంబంధించిన బిల్లులన్నీ సకాలంలో చెల్లించకపోవటంతో వారి పరిస్థితి దారుణంగా తయారైందన్నారు. అంగన్వాడీలు మానసిక ఇత్తిళ్లకు గురి అవుతున్నారన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు దశలవారీగా అనేక ఆందోళనలు చేసిన ఫలితంగా అధికారులతో జరిగిన చర్చల్లో సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 8 నుండి అంగన్వాడీ కేంద్రాలను మూసివేసి నిరవధికంగా సమ్మె చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి అంజనేయులు, సిఐటియు జిల్లా అధ్యక్షులు జడ్పీ శ్రీనివాసులు, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ దిల్షాద్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఆటో వర్కర్స్ యూనియన్ కార్యదర్శి పెడబల్లి బాబా, సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ, పట్టణ కార్యదర్శి గంగాధర్, బ్యాల్ల అంజి , కళాకారుల సంఘం నాయకులు నాగరాజు , సిద్దు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాబునిషా, శ్రీదేవి జిల్లాలోని అంగన్వాడీ కార్యకర్తల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కనగానపల్లి : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడి వర్కర్లు ఈనెల 8 నుంచి సమ్మెలోకి వెళ్లనున్నారు. ఈ మేరకు వారు సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహశీల్దార్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ కార్యక్రమంలో అనిత లక్ష్మి, సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు బత్తల కదిరప్ప పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

భర్త చేతిలో భార్య హతం

నిందితుడు అరెస్టు

పుట్టపర్తి క్రైమ్ : కట్టుకున్న భార్యను భర్త కిరాతకంగా కడతేర్చిన సంఘటన పుట్టపర్తిలో బుధవారం చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి గ్రామస్తులు, మృతురాలి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలు... మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లిలో రామకృష్ణ అనే తన భార్య రత్నమ్మ (45)తో కలిసి చిప్స్ తయారు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ ఈనేపథ్యంలో రామకృష్ణ మరో స్త్రీతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. విషయం తెలుసుకున్న రత్నమ్మ వారిద్దరిని ప్రత్యక్షంగా పట్టుకోవాలని భావించింది. ఈనేపథ్యంలో మంగళవారం రాత్రి రామకృష్ణ వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న స్త్రీ ఇంటికి వెళ్లాడు. ఇది గమనించిన రత్నమ్మ ఆ స్త్రీ ఇంటికి వెళ్లింది. రామకృష్ణ, ఆ స్త్రీ ప్రత్యక్షంగా పట్టుపడ్డారు. దీంత తన బాగోతం బయటపడడంతో రామకృష్ణ భార్యపై ఆగ్రహం ప్రదర్శించాడు. రత్నమ్మను కొట్టుకుంటూ ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ ఇనప రాడ్డుతో తల మీద బలంగా రత్నమ్మపై కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అయితే రత్నమ్మ మిద్దె మెటుకులపై నుంచి జారి పడినట్లు చిత్రీకరించడానికి రామకృష్ణ ప్రయత్నించాడు. తనకు ఏమీ తెలియనట్లు బుధవారం తెల్లవారు జామున చిప్స్ తయారీకి అవసరైన బంగాళదుంపలు తీసుకురావటానిఇక బాగేపల్లికి వెళ్లాడు. రత్నమ్మ మృతి విషయం తెలుసుకున్న అర్బన్ పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. అక్కడి పరిస్థితిని పరిశీలించారు. అదే సమయంలో ఇంటికి తిరిగి వచ్చిన రామకృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో పోలీసులు ఆరా విచారించడంతో తానే హత్య చేసినట్లు రామకృష్ణ అంగీకరించాడు. మృతురాలికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. ఇద్దరికీ వివాహం కాగా మరొక అమ్మాయి ఉంది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ కొండారెడ్డి తెలిపారు.



మృతురాలు రత్నమ్మ

మాజీ మంత్రి పల్లె నివాళి : ఎనుములపల్లి గ్రామం బీసీ కాలనీకి చెందిన రత్నమ్మ మృతిచెందడంతో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. వారి ఇంటి దగ్గరికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అగళి : మండలంలోని రామనపల్లి రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. గ్రామానికి చెందిన రమేష్ తన ఇంటి దగ్గర ఉన్న పశువులకు గంపలో వేరుశనగ గడ్డి తీసుకొని నడుచుకుంటూ రోడ్డును దాటుతున్న సమయంలో వేగంగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో రమేష్‌ను కారు కొంతదూరం రోడ్డుపై ఈడ్చుకుంటూ వెళ్లింది. దీంతో రమేష్ (35) అక్కడికక్కడే మతి చెందాడు. ప్రమాదానికి కారణమైన కారు కర్నాటక రాష్ట్రం వైపు వేగంగా వెళ్లింది. విషయం తెలుసుకున్న అగళి పోలీసులు వెంటనే స్పందించారు. కారును శిర తాలూకు బరగూరు దగ్గర అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బెదిరింపు కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం చౌళూరు రామకష్ణారెడ్డి హత్య కేసులో బెయిల్ పై వచ్చిన నిందితుడు మంజునాథ్‌ను బెదిరింపు కేసులో అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ సిఐ శ్రీనివాసులు తెలిపారు. గత సంవత్సరం చౌళూరు గ్రామంలో వైసిపి నాయకులు రామకృష్ణారెడ్డి హత్య కేసులో నిందితుడి ఉన్న మంజునాథ్ జైలులో ఉండి ఇటీవల బెయిల్‌పై వచ్చాడన్నారు. ఈ నేపథ్యంలో రామకృష్ణారెడ్డి సోదరి మధుమతికి సంబంధించిన వారిని సామాజిక మాధ్యమాల ద్వారా బెదిరింపులకు పాల్పడినందుకు మంజునాథ్‌ను అరెస్టు చేసినట్లు చెప్పారు. తూమకుంట చెక్‌పోస్టు వద్ద అదుపులోకి తీసుకుని అతని నుంచి రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ప్రపంచ తెలుగుసాహిత్య కళా ఉత్సవాలకు ఆహ్వానం

ధర్మవరం టౌన్ : పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఈ నెల 16,17 తేదీలలో జరిగే ప్రపంచ తెలుగుసాహిత్య కళా ఉత్సవాలకు తనకు ఆహ్వానం అందినట్లు ధర్మవరం పట్టణానికి చెందిన ప్రైవేటు పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు నామాల విజయ్‌కుమార్ తెలిపారు. 30 గంటల పాటు జరిగే ఈ ఉత్సవాల కార్యక్రమంలో తాను పాల్గొంటున్నానన్నారు. ఈ ఉత్సవాలలో సాహిత్యసదస్సులు, కళాప్రదర్శనలు, పుస్తకావిష్కరణ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు.

వాల్మీకి సంఘం నాయకుడికి సన్మానం

మడకశిర : నియోజకవర్గ వాల్మీకి సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన చింతపండు మోహన్‌ను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి బుధవారం సన్మానించారు. గతంలో వాల్మీకి సంఘం అధ్యక్షుడిగా ఉన్న మోహన్ తండ్రి చింత పండు ఆంజనేయులు ఇటీవల మృతిచెందాడు. దీంతో నియోజకవర్గ వాల్మీకి సంఘ నాయకులు సమావేశమై మోహన్‌ను నియోజకవర్గ వాల్మీకి సంఘం అధ్యక్షుడిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, డాక్టర్ సెల్ అధ్యక్షులు కృష్ణమూర్తి, పట్టణ అధ్యక్షులు మనోహర్, నాయీ బ్రాహ్మణ సాధికారిక కన్వీనర్ రామాంజనేయులు తదితరులు మోహన్‌ను అభినందించారు.

8న జిల్లా స్థాయి ఉద్యోగుల సంఘం ఎన్నికలు

బుక్కపట్నం : సత్య సాయి జిల్లాస్థాయి ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఈనెల 8న నిర్వహిస్తున్నట్లు ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షులు రాచం రెడ్డి భాస్కర్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పుట్టపర్తి లోని విమానాశ్రయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ జిల్లా ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఈ ఎన్నికలు జరుగుతాయని ఆసక్తి కలిగిన అన్ని శాఖల ఉద్యోగులు పాల్గొనాలని కోరారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండండి

ధర్మవరం టౌన్ : అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని టూటౌన్ సిఐ అశోక్ కుమార్ తెలిపారు. పట్టణంలోని దుర్గానగర్లో బుధవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా సిఐ ప్రజలతో సమావేశమయ్యారు. ఎవరైనా నేరాలకు పాల్పడితే జరిగే పరిణామాలు, పడే జైలు శిక్షల గురించి వివరించారు.

వికలాంగులను ఆదరించాలి

బత్తులపల్లి : సమాజం ఆదరిస్తే విభిన్న ప్రతిభావంతులు కూడా మేధావులేనని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆర్డీటి ఫీల్డ్ కార్యాలయంలో మాంఛూ ఫెర్రర్ విభిన్న ప్రతిభావంతుల మండల సమాఖ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఐడి ఎస్టీఎల్ యల్లమ్మ. సెంటర్ సిస్టర్స్ నక్షత్రమ్మ, క్యాతిలిన్, ఏవీహెచ్‌వి కోఆర్డినేటర్ ఉమాదేవి, ఆర్డో మాజీ ఎస్టీఎల్ నాగరాజు, ఎటిఎల్ రుక్మాంగద, ఉమెన్స్ ఎస్టీఎల్ సంజీవులు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్కిల్ కౌన్సిలర్స్ రమాదేవి, హనుమంతు. మండల సమాఖ్య ప్రతినిధులు జనార్ధనానాయుడు, గంగాదేవి, వేణు, నాగప్ప, సెంటర్ పిల్లలు, స్కిల్స్ ట్రైనింగ్ ని యువతీ, యువకులు సిపీ సెంటర్ పిల్లలు, గ్రామాల్లోని సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులను సరిదిద్దండి : పల్లె

పుట్టపర్తి అర్బన్ : ఓటర్ల తుది జాబితాలో ఎలాంటి తప్పులు జరగకుండా సరిదిద్దాలని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి అధికారులను కోరారు. బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో భాగ్యరేఖ, తహశీల్దార్ నవీన్ కుమార్‌తో కలసి చర్చించారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో పలు తప్పులు దొర్లాయని మృతి చెందిన వారి ఓట్లను తొలగించలేదని ఫిర్యాదు చేశారు. వలస వెళ్లిన వారి ఓట్లను తిరిగి రప్పించుకోవడానికి అధికారులు కృషి చేయాలన్నారు.

ముళ్లపొదలు తొలగింపు

బుక్కపట్నం : బుక్కపట్నం - ముదిగుబ్బ ప్రధాన రహదారి బుక్కపట్నం చెరువు కట్టపై ఇరువైపులా పెరిగిన ముళ్లపొదలు కంప చెట్లను తొలగించారు. ముళ్లకంపలు పెరిగి ప్రయాణం చేయడానికి ఇబ్బందిగా మారడంతో స్పందించిన సత్యసాయి జిల్లా టిడిపి కార్యదర్శి సామకోటి ఆదినారాయణ జెసిపి సహాయంతో కంపచెట్లు తొలగించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి సాకే యశోద, మాజీ ఎంపీపీ బాలు, లావణ్య గౌడ్, వెంకట రాముడు, సాదక్ వలి, సుధీర్, మంజు,సామకోటి ఈశ్వరయ్య, కిష్టా తదితరులు పాల్గొన్నారు.


ధర్మవరంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ తదితరులు


మడకశిరలో నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి తదితరులు


కదిరిలో అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్

అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా ఘనంగా అంబేద్కర్ వర్ధంతి వేడుకలు - పలువురి నివాళి

జిల్లా వ్యాప్తంగా రాజ్యాంగ నిర్మాత డా॥బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అన్ని మండలాల్లోనూ వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, ప్రజాసంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహాల వద్ద నివాళులు అర్పించారు. అంబేద్కర్ దేశ వెలుగు చుక్క అంటూ పలువురు అభివర్ణించారు. ఆయన రాసిన రాజ్యాంగం దేశ ప్రగతికి మూలంగా నిలుస్తోందన్నారు. అంబేద్కర్ ఆశయాలను కొనసాగించేలా అందరూ ముందుకు సాగాలని పలువురు పిలుపునిచ్చారు.

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దామని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ పేర్కొన్నారు. అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని నాశనం చేస్తూ మన ధర్మశాస్త్రాన్ని అధికారంలోకి తీసుకురావాలని ప్రయత్నిస్తోందన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని, దేశసమైక్యత సమగ్రతలను కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, సిపిఎం పట్టణ కార్యదర్శి నామాలనాగార్జున, రైతుసంఘం మండల అధ్యక్షులు కొత్తపేట మారుతి, సిఐటియు ఆదినారాయణ, అయూబ్‌ఖాన్, నాయకులు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాలింగప్ప, .జోగప్ప ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు భూతన్న, గుడిబండ మండల అధ్యక్షులు డి. నరసింహప్ప, జడ్పీహెచ్‌ఎస్ మందలపల్లి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, యుటిఎఫ్ నాయకులు. నరసింహమూర్తి, సుదర్శన్, నంజప్ప, దత్తు, వేద, కదురన్న, శివప్ప, మురళి, తిమ్మారాయప్ప తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి తదితరులు అంబేద్కర్‌కు నివాళి అర్పించారు. **రొద్దం :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్‌కు మాజీ ఎమ్మెల్యే బికె పార్థసారధి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నరహరి,జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, నాయకులు చిన్నప్పయ్య, అశ్వర్థనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా మేజర్ పంచాయతీ సర్పంచి గంగాదేవి నరసింహా మూర్తి, ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సర్పంచ్, దళిత సంఘాలు దండోరా నాయకులు ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సర్కిల్లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు నరసింహమూర్తి, ఈశ్వర్, కిష్ట నాగరాజు సూరి తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో బుధవారం అంబేద్కర్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీనివాసులు, రవి, ఈతోడు రమణ, అంజనప్ప, శంకర, తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : అంబేద్కర్ ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని ఎస్సీ సెల్ నియోజవర్గ అధ్యక్షురాలుసాకే యశోద రాయుడు తెలిపారు. అంబేద్కర్ 67వ వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి జిల్లాటీడీపీ కార్యదర్శి సామకోటి ఆదినారాయణ , మాజీ ఎంపీపీ బాలుసుబ్బారెడ్డి, సయ్యద్ భాష, లావణ్య గౌడ్, వెంకట రాముడు తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండల కేంద్రంలోని అంబేద్కర్ వర్ధంతినిఎస్సీ ఎస్టీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలనేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటనారాయణ, ఎస్సీ ఎస్టీ నాయకులు, వైస్ ఎంపిపి గంగోజమ్మ మేకల నరసింహులు, కొండయ్య, ఉత్తన్న తదితరులు పాల్గొన్నారు

పరిగి : మండలంలోని ప్రైవేట్ ప్రభుత్వ కార్యాలయాల్లో అంబేద్కర్ చిత్రపటానికి అధికారులు ప్రజాప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు. ఆయా పార్టీల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఓబుల దేవర చెరువు : అంబేద్కర్ వర్ధంతి వేడుకలను బుధవారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి గల నివాళు లర్పించారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డు జయన్న, మందోజి .ఆరీఫ్ ఖాన్ , రొద్దం శ్రీనివాసులు, సున్నపల్లి వెంకటరమణ,రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : అంబేద్కర్ ఆశయాల అమలుకు కృషి చేస్తామని టీడీపీ ఎస్సీసెల్ నాయకులు మేకల రామాంజి నేయులు, కేశగాళ్లశ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్లో అంబేద్కర్ వర్ధంతిని పురష్కరించుకుని అంబేద్కర్ విగ్రహానికిపూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ నాయకులు సుబ్రమణ్యం, శ్రీనివాసులు, మల్లికార్జున, ఆదినారాయణ, లక్ష్మీనారాయణ, ప్రభు, టైలర్ ముత్యాలప్ప తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పుట్టపర్తి రూరల్: అంబేద్కర్ 67వ వర్ధంతిని పుట్టపర్తి మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ బొల్లి ప్రసాద్ ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆవార్డు గ్రహీత రిటైర్డ్ టీచర్ బి వెంకటరత్నం, ఎంఆర్‌పిఎస్ సిబ్బంది నాగరాజు, రవి, సీఆర్పీలు, భవిత స్టాప్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల రూరల్ : మండల పరిధిలోని పాలసముద్రం గ్రామంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, జిల్లా అధ్యక్షులు హనుమయ్య,ఉపాధ్యక్షులు జ్యోతమ్మ , సిపిఎం మండల నాయకులు కొండా వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : అంబేద్కర్ 67వ వర్ధంతి సందర్భంగా డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శాసన సభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు డాక్టర్ ఎం. తిప్పేస్వామి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పుట్టకామప్ప, మున్సిపల్ చైర్మన్ తనయుడు జయరాజ్, కౌన్సిలర్ సుభద్ర నాగేంద్ర, ఎంపీపీ కవిత సత్యనారాయణ, జెడ్పీటీసీ సరోజ మూర్తి, మండల ఉపాధ్యక్షులు మూర్తి, విక్రమ్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రొద్దం : అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా పెద్దమంతురు సచివాలయంలో ఎంపిఇఒ చంద్రశేఖర్ అంబేద్కర్ చిత్ర పటానికి పులమాలవేసి నివాళులు అర్పించారు. అదే విధంగా మండలం దొడగట్ట గ్రామంలో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. అయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మూర్తి, తిప్పన్న, నాగరాజు, గోపాల్, దుర్గప్ప, జయప్ప , హనుమంత్, గోపాల్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ : గుడిబండ ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో రామారావు ఆధ్వర్యంలో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు ఘనంగా అంబేద్కర్ వర్ధంతిని జరుపుకున్నారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఈసీ లక్ష్మ నాయక్, ఏపీవో భార్గవి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు :కొత్త చెరువులో అంబేద్కర్ వర్ధంతి వేడుకలను టిడిపి నాయకులు దళిత సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. ధర్మవరం రోడ్డులోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ప్రసాద్, వలిపి శ్రీనివాసులు, రాంప్రసాద్, వెంకటేశు, సైకిల్ షాప్ బాబా, మౌలా, శంకర తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : భావితరాలకు మార్గదర్శిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నిలిచారని జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమం సాధికారిక అధికారి శివ రంగ ప్రసాద్ తెలిపారు. బుధవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయనతోపాటు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మోహన్ రావు ఉద్యోగ సిబ్బంది తదితరులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలను వేసి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని పలు కార్యాలయాలలో అంబేద్కర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల వనరుల కేంద్రంలో ఎంఇఒ ప్రసాద్, వైఎస్ఆర్‌పిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పివి రమణారెడ్డి, టిఆర్‌టియు అధ్యక్షుడు రజనీకాంత్ రెడ్డి, బి. వెంకటరత్నం ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలో టిడిపి, జనసేన నాయకులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి సామ కోటి ఆదినారాయణ, జనసేన నాయకులు డాక్టర్ తిరుపతేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక అంబేద్కర్ సర్కిల్లోని అంబేద్కర్ విగ్రహానికి అన్ని రాజకీయ పక్షాల నాయకులు పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు.

కదిరి టౌన్ : అంబేద్కర్ వర్ధంతి పురస్కరించుకొని కదిరి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు బి కదిరప్ప,ఉపేంద్ర తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో నాగార్జున, వంశీ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కదిరి పట్టణం లోని బాలికల కళాశాలలో అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళి అర్పించారు ఈ కార్యక్రమంలో నాయకులు గాలివీడు ఉపేంద్ర, నరసింహ, కళ్యాణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ కలలగన్న సామాజిక సాధికారత సిఎం జగన్మోహన్ రెడ్డి తోనే సాధ్యమని వైసిపి నాయకులు కొమ్ము విజయ భాస్కర్, సెంథిల్ సాయి తెలిపారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సివి. కృష్ణమూర్తి, బహువుద్దీన్, అన్వర్‌బాషా, లింగాల లోకేశ్వర్ రెడ్డి, నాగమ ల్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే కదిరి ఆర్టీసీ బస్టాండ్‌లో ఎస్సీ ఎస్టీ డిపో ఉద్యోగులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

హిందూపురం : అంబేద్కర్ భావితరాలకు ఆదర్శప్రాయుడని పలువురు పేర్కొన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం వైసిపి కార్యలయంలో వైసిపి ఇన్‌చార్జ్ దీపిక, మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మేన్ బలరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, మున్సిపల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు బండి ఆనంద్ రాజు తదితరులు అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అన్ని రాజకీయా పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, సిపిఎం, ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్, దళిత సంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాల్లో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో పాటు ప్రజా సంఘాల నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, సచివాలయ, కార్మిక సంఘ నాయకులతో పాటు కార్మికులు పాల్గొన్నారు.